క్లుప్తంగా

ఆర్థికసాయం

డోర్నకల్: ఉన్నత విద్యలో సీటు సాధించిన ఓ పేద విద్యార్థినికి బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు ఆర్థికసాయం అందించారు. మండలంలోని రాముతండాకు చెందిన నూనావత్ సంగీత ఐఐటీ మద్రాస్‌లో జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఆఫ్ మాస్టర్(జామ్) ద్వారా ఎమ్మెస్సీ కెమిస్ట్రీ (పీజీ) సీటు సాధించింది. పేద కుటుంబం కావడంతో సంగీత ఫీజు చెల్లించలేని పరిస్థితిలో ఉండగా బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం రూ.17,100 ఆర్థికసాయాన్ని తల్లిదండ్రులైన మంగీలాల్, శాంతకు అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు పులి దేవేందర్, సమన్వయకర్త ఎండీ అబ్దుల్ అజీజ్, సుధాకర్, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కేసముద్రం: మండలంలోని గాంధీపురం శివారు వెంకట్రాంతండాకు చెందిన బాదావత్ యాకమ్మ (38) పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం.. సాయంత్రం తండాకు చెందిన యాకమ్మ ఇంట్లో సాయంత్రం పురుగుల మందుతాగగా మానుకోట ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త ఉన్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

ఇద్దరి రిమాండ్

గార్ల: ఇంటి దారి విషయంలో గత నెల 28న జరిగిన ఘర్షణలో 8 మంది పై కేసులు కాగా, వీరిలో ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు. మండలంలోని పుల్లూరుకు చెందిన అన్నం వీరమ్మపై వడ్డూరి గురువమ్మ అనుచరులు ఇంటి దారి విషయంలో కర్రతో దాడి చేశారు. కేసు విచారించిన అనంతరం దాడికి పాల్పడ్డ గోకినపల్లి వీరేష్, వడ్డూరి వెంకటేష్‌లను రిమాండ్ నిమిత్తం మహబూబాబాద్ కోర్టుకు తరలించామని, మిగతా ఆరుగురు పరారీలో ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాతలు సహకరించాలి

మరిపెడ రూరల్: బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుతున్న ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి దాతలు సహకరించాలని స్థానిక వైస్ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిల్లంచర్ల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అదేగ్రామానికి చెందిన దాత బెన్నబోయిన నాగన్న రూ. 5 వేలు విలువగల తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టులకు సంబంధించిన వర్క్ బుక్‌లను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీశైలం, సర్పంచ్ నుర్జాహాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ బహూకరణ

దంతాలపల్లి: మండలంలోని రామానుజపుర వాసి కవి, రచయిత, సతీష్‌కు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త సోమవారం ల్యాప్‌టాప్ బహూకరించారు.

ఉచిత వైద్య శిబిరం

చిన్నగూడూరు : మండలంలోని పగిడిపల్లి జీపీలో ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో మొత్తం 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరం వచ్చిన వారి నుంచి రక్త నమూనాలు సేకరించి వారికి మందులు పంపిణీ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీ సుమలత, పాల్గొన్నారు.

రిజర్వేషన్ కల్పించాలి

మహబూబాబాద్: ట్రాన్స్‌జెండర్లకు విద్యా, ఉద్యోగ, ఉపాధిలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని ట్రాన్స్‌జెండర్లు అను, వాహిని, పావని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ట్రాన్స్‌జెండర్లు (హిజ్రాలు) ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసరా పెన్షన్, డబుల్‌బెడ్ రూం, ప్రత్యేక ఆరోగ్యశ్రీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి

బయ్యారం: వర్షాలు కురుస్తున్నందున ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని కోరుతూ పీవైఎల్ ఆధ్వర్యంలో సోమవారం బయ్యారం పీహెచ్‌సీ ఎదుట ఆందోళన నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గణేష్ మాట్లాడారు. అనంతరం వైద్యాధికారి సాగర్‌కు వినతిపత్రంను అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

దంతాలపల్లి: మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం బీరిశెట్టిగూడెంకు చెందిన గుగులోత్ నెహ్రూ సర్పంచ్, ఉపసర్పంచ్ స్వాతి భర్త వెంకన్న గ్రామానికి సంబంధించిన చెక్కుల విషయంలో మాట్లాడుతుండగా నెహ్రూ కుమారుడు నవీన్ తన తండ్రి వద్దకు చేరుకున్నాడు. అదే గ్రామానికి చెందిన షేక్ జానీపాషా అక్కడికి చేరుకొని తనకు సంబంధం లేని విషయంలో జోక్యం చేసుకున్నాడు. ఈ విషయంలో నవీన్‌కు జానీపాషా గొడవపడి నవీన్‌ను కులం పేరుతో దుర్భాషలాడి తనను కొట్టాడని నవీన్ ఫిర్యాదు మేరకు జానీపాషాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

దంతాలపల్లి : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● మున్సిపల్ గ్రామసభలో మహిళా సంఘాల సభ్యుల డిమాండ్



ఈదులపూసపల్లి సభలో నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల సభ్యులు

మహబూబాబాద్ అర్బన్: మహిళా సంఘాల రుణాలు బ్యాంకులకు చెల్లించకపోవడం, ఆర్పీలు, వీఓఏలు, ఏపీఎం, మున్సిపల్ మెప్మా, బ్యాంక్ అధికారులు కుమ్మక్కై మహిళా సంఘాలను మోసం చేశారని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఈదులపూసపల్లి మహిళా సంఘాల సభ్యులు సరోజ, పద్మ, విజయ, యశోద డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి డ్వాక్రా మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ గ్రామసభ ఏర్పాటు చేయగా సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ గ్రామ పరిధి తండాలతో కలుపుకొని మొత్తం 68 సంఘాలు ఉన్నాయన్నారు. ఆ సంఘాల అవసరాల మేరకు బ్యాంకు నుంచి గత మూడు, రెండు సంవత్సరాల క్రితం రుణాలు తీసుకున్నామని, ప్రతి నెల బ్యాంక్‌కు చెల్లించాల్సిన డబ్బులను ఆర్పీలు, వీఓఏలు, ఏపీఎంలకు అందజేయగా వారు డబ్బులను బ్యాంకులో చెల్లించకపోవడం, తమ సొంతానికి ఇష్టానుసారంగా వాడుకున్నారు. ఇలా 2021, 2022, 2023 సంవత్సరాల నుంచి బ్యాంక్‌లకు రుణాలు చెల్లింపు చేయకపోవడం, శ్రీనిధి రుణాల డబ్బులు బ్యాంక్‌లో కట్టకపోవడంతో వడ్డీ మీద వడ్డీ పడిందని, కొత్త రుణాలు అవకాశం లేకపోయిందన్నారు. రుణాల బ్యాంక్ పాస్‌బుక్‌లపై ప్రింట్ తీయాల్సిన బుక్‌లను తమ వద్దే ఉంచుకొని, బుక్‌లపై ప్రింటింగ్ ఏమైందని అడుగగా మిషన్ చెడిపోయిందని, ప్రింట్ రావడం లేదని కల్లబొల్లి మాటలు చెబుతూ దాటవేస్తున్నారన్నారు. ఇప్పటికే 9 మహిళా సంఘాల డబ్బులపై లెక్కలు చేసి విచారణ చేయగా సుమారు రూ. 50 లక్షలు లెక్కలు తేడా వచ్చాయన్నారు. దీనిపై వీఓఏలను నిలదీయగా మీరు ఇలా అడిగితే మేము పురుగుల మందు తాగి చనిపోతామని మహిళ సంఘాల సభ్యులను బెదిరిస్తున్నారు. వీఓఏలు మహిళ సంఘాల రుణాల్లో మోసం చేయాడం కాక, తిరిగి చనిపోతామని బెదిరించడం, వారి చావుకు కారణం మేమైతే కాదని, వారి చావుకైతే ఈదులపూసపల్లి మహిళా సంఘాలకు ఎటువంటి సంబంధం లేదన్నారు. అధికారులు స్పందించి డ్వాక్రా సంఘాలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు రాణి, సంధ్య, లక్ష్మి, ఎల్లమ్మ, మంజుల, శారద, రమాదేవి, మల్లమ్మ, మంజుల, కొమురమ్మ, లలిత, మహాలక్ష్మి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే ప్రధాన లక్ష్యం



సర్వసభ్య సమావేశంలో చైర్మన్, కౌన్సిలర్లు

తొర్రూరు: పట్టణ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. స్థానిక మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం సోమవారం కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ పి.సరస్వతి 18 అంశాలపై ఎజెండా ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. రూ.50 లక్షలతో పట్టణంలో పైప్‌లైన్ నిర్మాణం, రూ.10 లక్షలతో నర్సరీకి ఫార్మేషన్ రోడ్డు ఏర్పాటు, మరమ్మతులకు ఒక్కో వార్డుకు రూ.50 వేలు కేటాయించేందుకు తీర్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మంత్రి పంచాయతీరాజ్ మంతిర దయాకర్‌రావు సహకారంతో రూ.120 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మహబూబాబాద్ పర్యటనలో సీఎం కేసీఆర్ రూ.25 కోట్లు, తొర్రూరులో కేటీఆర్ మరో రూ.25 కోట్లు తొర్రూరు మున్సిపాలిటీకి కేటాయించారన్నారు. మున్సిపాలిటీని రాష్ట్రంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతుందన్నారు. అనంతరం కార్యాలయంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, కౌన్సి లర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



దాతలను సన్మానిస్తున్న సర్పంచ్, హెచ్‌ఎం

కురవి : చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎన్‌ఆర్‌ఐ బండి వంశీధర్‌రెడ్డి, స్థానిక జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి)లోని జెడ్పీ హైస్కూల్‌కు ఎన్ఆర్ఐ బండి కవిత–వంశీధర్‌రెడ్డి, రుక్మిణి–సుదర్శన్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి కుమార్తె బండి తారారెడ్డిలు రూ.1లక్ష విలువ కలిగిన సైన్స్ ల్యాబ్ పరికరాలు, రెండు బీరువాలు, ఒక కంప్యూటర్ ప్రింటర్, లైబ్రరీ పుస్తకాలను అందచేశారు. సైన్స్‌ల్యాబ్‌ను సోమవారం తారారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండి ఎడ్యూకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు స్కూల్‌కు అనేక సేవలందించామని తెలిపారు. స్కూల్‌కు రెండున్నర ఎకరాల భూమి కొనుగోలు చేసి మైదానం అప్పగించామని తెలిపారు. మున్ముందు సైతం స్కూల్ కోసం పాటుపడుతామని తెలిపారు. విద్యార్థులు మంచి మెరిట్‌తో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి–రుక్మిణి, వంశీధర్‌రెడ్డి, తారారెడ్డి, సీతారాంరెడ్డిలను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ జంగిలి హరిప్రసాద్, హెచ్‌ఎంలు లక్ష్మయ్య, ఎల్లయ్య, గ్రామ పెద్దలు బండి అనిల్‌రెడ్డి, బండి అజయ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలి



కేసముద్రం : కేసముద్రంలో బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

● ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
● ఘనంగా మంత్రి కేటీఆర్ జన్మదినం



మహబూబాబాద్ : పారిశుద్ధ్య కార్మికులచే కేక్ కట్ చేయిస్తున్న రామ్మోహన్‌రెడ్డి



డోర్నకల్ : కేక్ కట్ చేస్తున్న చైర్మన్ వీరన్న



దంతాలపల్లిలో : కేక్ కట్ చేస్తున్న నాయకులు



కురవి : ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు



గార్లలో..



తొర్రూరులో..



నెల్లికుదురులో..

కేసముద్రం: ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతున్న కేసీఆర్‌ను ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఓట్లేసి, మూడోసారి సీఎం చేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్‌ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించాడు. అదే ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాడు.

మహబూబాబాద్: మంత్రి కేటీఆర్ చొరవతోనే మున్సిపాలిటీలు అన్ని అభివృద్ధి చెందాయని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపాలిటి కార్యాలయంలో సోమవారం మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. డోర్నకల్ మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో సోమవారం మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కురవి : మండల కేంద్రంలో ఐటీశాఖ, మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్, జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి పుట్టినరోజు సందర్భంగా సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. దంతాలపల్లిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు ధర్మారపు వేణు ఆధ్వర్యంలో సోమవారం న్విహించారు. గార్లలో బీఆర్‌ఎస్ నాయకులు మంత్రి జన్మదిన వేడుకలు నిర్వహించారు. నెల్లికుదురు పార్టీ కార్యాలయంలో మండల బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నిర్వహించారు. గూడూరు, పెద్దవంగర, తొర్రూరు మండల కేంద్రాల్లో మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంప్ ఆఫీసులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



గూడూరు : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



పెద్దవంగర : కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దిష్టిబొమ్మ దహనం

గార్ల: మణిపూర్ ఘటనను నిరసిస్తూ సోమవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి సక్రు మాట్లాడారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బి దేవేందర్, ఏఐకేఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

గూడూరు : మండల కేంద్రంలో మణిపూర్ ఘటనను నిరసిస్తూ తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు.

మహబూబాబాద్ రూరల్ : మణిపూర్‌లో జరుగుతున్న మతోన్మాదాన్ని పారద్రోలాలని ప్రవక్త రెవరెండ్ పద్మం నాగేంద్రపాల్, జ్యోతిర్మయి అన్నారు.

కేసముద్రం: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యను నిరసిస్తూ మండల కేంద్రంలోని గాంధీసెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శాంతిర్యాలీ నిర్వహించారు.

మహబూబాబాద్ అర్బన్: మహిళపై జరుగుతున్న హింసకాండకు రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేస్తున్నారని ఆ బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు కఠినంగా శిక్షించాలని హోలీవర్డ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ జయశ్రీ, డైరెక్టర్లు డిమాండ్ చేశారు.

నెహ్రూసెంటర్ : మహిళలపై జరిగిన సంఘటన దేశం తలదించుకునేలా ఉందని, అసభ్యకరంగా ప్రవర్తించిన వారిని శిక్షించి బీజేపీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



గూడూరు : వంటావార్పు చేసి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



కొత్తగూడ : చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

గూడూరు/డోర్నకల్/కొత్తగూడ/కురవి/మహబూబాబాద్ రూరల్/తొర్రూరు/కేసముద్రం/గార్ల: మండల కేంద్రాల్లో సోమవారం 18 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు వంట వార్పు కార్యక్రమం నిర్వహించారు. చెవిలో పవ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. కురవిలో గుడిసెంటర్ వద్ద ఒంటికాలిపై నిలుచుని నిరసన వ్యక్తం చేశారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. కేసముద్రం ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో పంచాయతీ కార్మికులు బతుకమ్మ ఆటాపాటలతో నిరసన వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

అనస్తీసియా మిషన్ల బహూకరణ

నెహ్రూసెంటర్ : మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, డాక్టర్ సీతామహాలక్ష్మి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌లో అవసరమయ్యే రెండు అనస్తీసియా మిషన్లను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మెన్ ఎండి ఫరీద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకట్ లకావత్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

మరిపెడ: వ్యవసాయ కూలీలకు కనీసం వేతనాలు అమలయ్యేలా చూడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న డిమాండ్ చేశారు. మండలం కేంద్రంలో కూలీ రేట్లు పెంచాలని కూలీలతో కలిసి సోమవారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికే పర్యటనలు

డోర్నకల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కోసమే ఎమ్మెల్యే రెడ్యానాయక్ గ్రామాల్లో పర్యటిస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గత నెల రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో పర్యటిస్తున్నారన్నారు.

రూ.11.90 కోట్ల బీటీ రోడ్లు మంజూరు

కురవి: మండలంలోని వివిధ గ్రామాల్లో బీటీ రోడ్లు నిర్మించేందుకు ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ రూ.11.90 కోట్లను మంజూరు చేశారని బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి బజ్జూరి పిచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు తోట లాలయ్య అన్నారు. సోమవారం మండలంలోని నేరడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మండలంలో పల్లెపల్లెకు కార్యక్రమాన్ని నిర్వహించి రోడ్లకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు గుగులోత్ రవి, సొసైటీ చైర్మన్లు దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, గార్లపాటి వెంకటరెడ్డి, సర్పంచ్ గుండోజు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తాం

గార్ల : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టగానే రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ జి.రవి అన్నారు. గడప గడపకు కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా మండలం లోని మర్రిగూడెం, రాజుతండా, బీఆర్‌ఎస్‌తండాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు.

రోగులకు పండ్ల పంపిణీ

దంతాలపల్లి: స్థానిక పీహెచ్‌సీలో క్షయ దివాస్‌లో భాగంగా న్యూట్రిషన్, టీబీ అంశాన్ని పురస్కరించుకొని సోమవారం మంజుల కుమారుడు కీర్తిరాజ్ క్షయ, టీబీ 46 మంది రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

సంక్షేమ హాస్టల్లో నాణ్యమైన భోజనం

మరిపెడ రూరల్: రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానిదేనని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు భూక్య ప్రవీణ్‌నాయక్ అన్నారు. మండలంలోని దంటకుంటతండాలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మరిపెడ రూరల్: అన్ని వర్గాల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ అన్నారు. మండలంలోని బావోజిగూడెం గ్రామానికి చెందిన గుండాల ఉపేందర్‌కు సీఎం సహాయ నిధి కింద రూ.43,500 మంజూరు కాగా చెక్కును బీచ్‌రాజ్‌పల్లిలో లబ్ధిదారుడికి సోమవారం అందజేశారు.

జంగిలిగొండలో గ్రీన్ చాలెంజ్ హరితహారం

మహబూబాబాద్ రూరల్ : గ్రీన్ చాలెంజ్ హరితహారంలో భాగంగా మండలంలోని జంగిలిగొండ సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ పంజాల సాయిలు, విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ పి.విజయ్, రమేష్, రీజనల్ సెక్రటరీ రవికుమార్, రవీందర్, పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మరిపెడ: మండల కేంద్రంలోని కార్గిల్ స్తూపం వద్ద మంగళవారం నిర్వహించే కార్గిల్ విజయ్ దివస్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కార్గిల్ సోల్జర్ కమిటీ చైర్మన్ గాదె రాంబాబు అన్నారు. కార్గిల్ స్తూపం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మహబూబాబాద్: ఈనెల 29న ఇందిరాపార్క్ వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 317 జీఓ బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు రాములు, హరికృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

గూడూరు : మండల కేంద్రంలో సోమవారం సీఎం కేసీఆర్ ముస్లీం మైనార్టీ వర్గాలకు రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించిన సందర్భంగా మండల మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేసీఆర్, ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

పెద్దవంగర: సీఎం కేసీఆర్ పే స్కేల్ అమలు నిర్ణయాన్ని హర్షిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు. వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

చెత్త ట్రాక్టర్‌ను అడ్డుకున్న జీపీ కార్మికులు

గార్ల: మండల కేంద్రంలో రెగ్యులర్ పంచాయతీ ఉద్యోగులు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తుండగా సోమవారం సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు చెత్త ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు చెత్త ట్రాక్టర్‌ను కదలనివ్వమని ట్రాక్టర్ ఎదుట కార్మికులు బైఠాయించి నినాదాలు చేశారు. డీఎల్‌పీఓ గంగాభవాని, ఎంపీడీఓ రవీందర్ వచ్చి ట్రాక్టర్‌ను వెళ్లనీయమని కార్మికులను కోరినా వినకపోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఎస్సై బానోత్ వెంకన్నకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై కార్మికులతో మాట్లాడి అక్కడి నుండి చెత్త ట్రాక్టర్‌ను పంపించారు.

పార్టీ కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

● డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

చిన్నగూడూరు: ప్రతీ కార్యకర్త కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. నర్సింహుల పేట మండలం ముంగిమడుగు గ్రామానికి చెందిన డప్పుకాటి రాములు ఇటీవల మృతి చెందాడు. అయనకు పార్టీ సభ్యత్వం ఉండడంతో ప్రమాద బీమా మంజూరైంది. సోమవారం మండలంలోని ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే నివాసంలో సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి అందజేశారు. ఎమ్మెల్యే రెడ్యా మాట్లాడుతూ కార్యకర్తలను కాపాడుకునేది ఒక్క బీఆర్‌ఎస్ మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు శంకర్ గౌడ్, వార్డు మెంబర్ దొంతు రామ్మూర్తి, నాయకులు బత్తిని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌లు షేర్ చేయవద్దు

మహబూబాబాద్ అర్బన్: క్యూఆర్ కోడ్‌లను ఇతర వ్యక్తులను నమ్మి షేర్ చేయవద్దని మహిళ ఎస్సై సునంద అన్నారు. ఎస్పీ శరత్ చంద్రపవార్, సీసీఎస్ డీఎస్పీ గంద్రతి మోహన్ ఆదేశాల మేరకు స్థానిక మహాత్మజ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మానవ అక్రమ, వివాహ, రవాణా, ఉమెన్ సేఫ్టీ, సెక్యూరిటీ క్యూఆర్ కోడ్‌లపై అవగహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల పట్ల మంచి నడుచుకోవాలన్నారు. బాలికలను, విద్యార్థులను ఎవరైనా బ్లాక్ మెయిల్ చేస్తే షీ టీమ్‌ను సంప్రందించాలని, వాట్సాప్ 8712656935– 79011 42009 నంబర్‌ను సంప్రందించాలన్నారు. అనంతరం తల్లిదండ్రులు లేని విద్యార్థి దేవాహర్ష ప్రతిభను గుర్తించి రూ.5 వేలను నగదు ప్రోత్సాహాన్ని ఎస్సై అందజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, స్థానిక ఎస్సైలు ఆనంద్, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, మహిళా కానిస్టేబుళ్లు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు మంజూరు చేయాలి

తొర్రూరు: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు.

దంతాలపల్లి : జిల్లాలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మధు అన్నారు. విద్యాసమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జీపుజాతా సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది.

డోర్నకల్: నియోజకవర్గం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శాంతకుమార్ డిమాండ్ చేశారు.

గార్ల: విద్యారంగ సమస్యలు పరిష్కరించని ప్రభుత్వాలు మాకు వద్దంటూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు యాత్ర సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ జీపు యాత్రను ఉద్దేశించి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సాయికుమార్ మాట్లాడారు.